క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



గూడూరురూరల్: చెన్నూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

గూడూరురూరల్: మున్సిపాలిటీలో విలీన గ్రామాలైన చెన్నూరు, నెల్లటూరు, దివిపాళెం, పోటుపాళెం, పురిటిపాళెం, చిల్లకూరు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గూడూరు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 81 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. గత రెండు రోజుల నుంచి 50 పోలింగ్ కేంద్రాలను పరిశీలించగా శుక్రవారం 31 పోలింగ్ కేంద్రాలను పరిశీలించామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వసతులను కల్పించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రిజిస్ట్రేషన్ పత్రాల అందజేత



పత్రాలను పంపిణీ చేస్తున్న ఢిల్లీబాబు

వెంకటగిరిరూరల్: పట్టణంలోని టిడ్కో లబ్ధిదారులకు స్థానిక గాంధీ సచివాలయంలో గురువారం రిజిస్ట్రేషన్ పత్రాలను వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని తెలిపారు. ఇటీవల 1,008 ఇళ్లను లబ్ధిదారులకు అందజేయగా మిగిలిన వారికి రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ షేక్ గౌష్ బాషా, వైఎస్సార్‌సీపీ నేతలు కేశవులు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడా బర్డ్‌ఫ్లూ లేదు



గ్రామస్తులతో మాట్లాడుతున్న కృష్ణారావు

వాకాడు: మండలంలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ లక్షణాలు లేవని మొలగనూరు పశువైద్యాధికారి కృష్ణారావు తెలిపారు. ఆయన తన సిబ్బందితో కలసి గురువారం పలు గ్రామాల్లో కోళ్లను పరిశీలించారు. వావిళ్లపాళెం, కొండూరు, బూడిదలవాగు తదితర గ్రామాల్లో కోళ్ల పెంపకందారులతో సమావేశం నిర్వహించారు. బర్డ్‌ఫ్లూ లక్షణాలు ఎక్కడా లేవని, కేవలం అపోహ మాత్రమేనన్నారు. ఒక వేళ అలాంటివి ఉంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఏడీఏ భాస్కరయ్య

వెంకటగిరిరూరల్: ఉద్యానవన పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తిరుపతి వ్యవసాయ శాఖ ఏడీఏ భాస్కరయ్య సూచించారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానవన పంటలైన మామిడి, నిమ్మతోటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి గోవిందరాజులు మాట్లాడుతూ నిమ్మ పంటలో ప్రధానంగా ఆశించే తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నాగార్జునసాగర్, ఏఓ సుజాత, ఆర్ఆర్ఓ తిరుపాల్, హార్టికల్చర్ అధికారి ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభానికి ముస్తాబు



ఆబాక సచివాలయ భవనం

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని ఆబాక సచివాలయ భవనం ప్రారంభానికి ముస్తాబైంది. రూరల్ పరిధిలోని దామానెల్లూరు, మంగానెల్లూరు, ఆబాక, కడపత్ర, మంగళంపాడు, కేసీఎన్‌గుంట, కోటపోలూరు-1, కోటపోలూరు-2 సచివాలయాలకు రూ.3.05 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో మంగానెల్లూరు, కోటపోలూరు-2 సచివాలయాల భవనాల నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. త్వరలోనే అన్ని పనులు పూర్తి చేసి, అందుబాటులోకి వస్తాయని పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

పూరిల్లు దగ్ధం

కలువాయి: మండలంలోని బాలాజీరావుపేట ఎస్సీ కాలనీలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. బాధితురాలి కథనం మేరకు.. కాలనీకి చెందిన పామర్తి లక్ష్మమ్మ వలంటీర్‌గా పనిచేస్తోంది. ఆమె ఉపాధి నిమిత్తం వెళ్లిన కొన్ని కుటుంబాల వారికి ఆరోగ్యశ్రీ కార్డులు అందజేసేందుకు గురువారం ఉదయం నెల్లూరుకు వెళ్లింది. ఉదయం 11.30 గంటల సమయంలో ఇంటికి నిప్పంటుకుని మంటల వ్యాపించడంతో ఇంట్లోని టీవీ, దుస్తులు తదితర విలువైన సామగ్రి కాలిపోయాయి. చుట్టుపక్కల వారు వచ్చి మంటలను అదుపుచేశారు. ఈ విషయమై బాధితురాలు అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.

మహిళల ఆర్థిక పరిపుష్టికి 'ఆసరా'



ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న మేరిగ మురళీధర్



అవార్డులు అందుకున్న వలంటీర్లతో మేరిగ

చిల్లకూరు: వైఎస్సార్ ఆసరా పథకం మహిళల ఆర్థిక పరిపుష్టికి ఆసరాగా నిలుస్తోందని వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. చిల్లకూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, 766 స్వయం సహాయక సంఘాల సభ్యులు 7,631 మందికి నాలుగో విడతగా రూ.5.9 కోట్ల మెగా చెక్కును పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడ స్త్రీ పూజింపబడుతుందో అక్కడ ప్రకృతి కూడా తోడుగా ఉండి రాజ్యం సుభిక్షంగా ఉంటుందన్నారు. గత ఎన్నికల సమయంలో టీడీపీ పొదుపు మహిళలను పసుపు కుంకుమ పథకం పేరుతో మోసం చేసిందన్నారు. పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి మహిళల బాధలు తెలుసుకుని వారి కష్టాలను తీర్చేందుకు రుణాలను మాఫీ చేయడంపాటు వారికి ఆసరా, చేయూత, సున్నావడ్డీ, జగనన్న తోడు, స్త్రీ నిధి తదితర పథకాలు అమలు చేసి, వారికి అండగా నిలిచారన్నారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

వలంటీర్‌ల సేవలు అనిర్వచనీయం

వలంటీర్ల సేవలు అనిర్వచనీయమని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ కొనియాడారు. చిల్లకూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి అని అన్నారు. వారి సేవలను గుర్తించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారిని సముచితంగా గౌరవించాలని భావించి, ఏటా సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులతో సత్కరించి, వారిని ఉత్సాహపరుస్తున్నారని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్‌లపై ఎంతో నమ్మకం ఉంచి వారికి గురుతర బాధ్యతను అప్పగించారని తెలిపారు. ఇంటి వద్ద ఉంటూ తమ పనులు చేసుకుంటూనే గౌరవ వేతనం అందుకుంటున్న వలంటీర్లు ఆ ప్రాంతానికి ఒక సైనికుడిలా ఉండాలని సూచించారు. అనంతరం ముత్యాలపాడు, తమ్మినపట్నం, ఉడతావారిపాళెం, మోమిడి, కడివేడు గ్రామ సచివాలయాల పరిధిలోని మాచిరెడ్డి దివ్య, కోడి కసుమూరు, యేలూరు సుజనమ్మ, రాయపు శ్రీనివాసులు, నక్కా మధుకు సేవారత్న అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ భానుమూర్తి, పొదుపు గ్రూపుల ఏరియా కోఆర్డినేటర్ చంద్రబాబు, ఏపీఎం గుణయ్య, ఏఎంసీ చైర్ పర్సన్ ఓ యమునమ్మ, మాజీ ఎంపీపీ డీ మధుసూదన్‌రెడ్డి, నాయకులు ఓ బాలకృష్ణారెడ్డి, ఆర్ పిచ్చయ్య నాయుడు, వై సనత్‌కుమార్‌రెడ్డి, యూ శ్రీనివాసులు యాదవ్, కే అశోక్, ఎం శ్రీనివాసులు, వై అనుదీప్, ఎస్ శారదమ్మ, ఈ లావణ్య, కమృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు..సేవా సైనికులు



అవార్డులందుకున్న వలంటీర్లతో నేదురుమల్లి



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సంస్కరణలను పారదర్శకంగా ప్రజలకు అందిస్తున్న సేవా సైనికులు, సంక్షేమ వారధులు వలంటీర్లని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సైదాపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలను ప్రదానం చేశారు. అనంతరం నేదురుమల్లి మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధుల్లా పనిచేస్తున్న వలంటీర్లను చూసి ప్రతిపక్షాలకు భయపడుతున్నాయన్నారు. వలంటీర్లపై పచ్చ పత్రికలు, పచ్చపార్టీ నేతలు విషం కక్కుతున్నారన్నారు. తాము అధికారంలోకి వస్తే మీ అంతుచూస్తామంటూ భయపెడుతున్నారని, అలాంటి బెదిరింపులకు భయపడొద్దని, వలంటీర్లకు అండగా తాను ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. అనంతరం సేవావజ్ర అవార్డు వచ్చిన గుమ్మడి ప్రసన్నకు రూ.45వేలతోపాటు పురస్కారం అందజేసి, సన్మానించారు. సేవారత్న అవార్డులు వచ్చిన బి శ్రీనివాసులు, విజయమ్మ, అశోక్‌కుమార్, శైలజ, మణెమ్మకు రూ.30 వేల నగదు అందజేసి, సత్కరించారు. సేవామిత్ర పురస్కారాలకు ఎంపికైన 246మంది వలంటీర్లకు శాలువ కప్పి, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎం రవికుమార్‌యాదవ్, ఎంపీడీఓ సుధాకర్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, వైస్ ఎంపీపీలు భాస్కర్, రామ్‌గోపాల్‌రెడ్డి, మాలకొండారెడ్డి, రాపూరు జేసీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ బీ వెంకటేశ్వర్లురెడ్డి, సర్పంచ్‌లు రమాదేవి, శారద, వెంకట రత్నమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు పద్మ, పార్టీ మండల ఉపాధ్యక్షులు రాజశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మీ ఆడపడుచుగా మీ ఊరికి వచ్చా!



దగ్గవోలులో రామానాయుడిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి

దక్కిలి: 'మీ ఆడ పడుచుగా మీ ఊరికి వచ్చాను.. మీరంతా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేయండి. వైఎస్సార్ సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించి, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోండి.' అని పిలుపునిచ్చారు. మండలంలోని దగ్గవోలులో అనారోగ్యంతో బాధపడుతున్న నేదురుమల్లి అభిమానులు, సర్పంచ్ కోలా చిన్నమ్మ, కోలా రామానాయుడు, తోట శంకరరెడ్డి కుటుంబ సభ్యులను గురువారం ఆమె పరామర్శించారు. నేదురుమల్లి రాజ్యలక్ష్మి రాకతో ఆ గ్రామంలో మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి, ఆమెతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ సీహెచ్ శ్రీనివాసులు రెడ్డి, వైఎస్సార్‌సీపీ బాలాయపల్లె మండల కన్వీనర్ వీ కార్తీక్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వీ పరుశురామయ్య, దగ్గవోలు సొసైటీ అధ్యక్షుడు ఘట్టమనేని శ్రీనివాసులునాయుడు, నాయకులు ఎం నారాయణరెడ్డి, వేణు నాయుడు, మస్తాన్‌నాయుడు, మీరయ్యానాయుడు, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, రామస్వామినాయుడు, ఏ పెంచలయ్య, ఎస్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాల పరిశీలన

పెళ్లకూరు: మండలంలోని కలవకూరు, పుల్లూరు, పాలచ్చూరు, బంగారంపేట, రోసనూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం స్థానిక తహసీల్దార్ కేవీఆర్‌వీ ప్రసాద్‌రావు పరిశీలించారు. ఎన్నికల నిబంధనలలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పలు పోలింగ్ కేంద్రాలు పరిశీలించి, అక్కడ పరిస్థితులపై ఆరా తీసినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి తదితర అంశాలపై దృష్టి పెట్టామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలున్నట్లు చెప్పారు. ఆయన వెంట వీఆర్వోలు వంశీ, రవీంద్ర వీఆర్‌ఏ కృష్ణ, సురేష్ తదితరులు ఉన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా



బోల్తాపడిన లారీ

రాపూరు: పెంచలకోన-రాపూరు మార్గంలోని వెలుగోను మలుపు వద్ద గురువారం లారీ అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికల సమాచారం మేరకు.. శ్రీకాళహస్తి నుంచి బద్వేల్‌కు ప్లాస్టిక్ కూల్ డ్రింక్ బాటిళ్ల తీసుకెళుతున్న లారీ మలుపు వద్ద అదుపు తప్పడంతో బోల్తా పడింది. అందులో ఉన్న డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదని తెలిపారు.

ఉయ్యాలవాడను తెలుగువారంతా గుర్తుంచుకోవాలి



బహుమతులు అందజేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నేతలు

చిల్లకూరు: తొలి స్వాతంత్ర్య పోరాటయోధుడు తెలుగు వారి ముద్దుబిడ్డ ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని తెలుగువారంతా గుర్తుంచుకోవాలని రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. మండలంలోని పారిచెర్లవారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ, వ్యాస రచన పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం చిల్లకూరు మండల శాఖ అధ్యక్షులు సనత్ కుమార్ రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రామమోహన్‌రెడ్డి, ప్రజేంద్ర రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, హరినాథ్‌రెడ్డి, ప్రహ్లాదరెడ్డి, సిద్ధారెడ్డి, సురేష్‌రెడ్డి, వేంకటశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌వే బ్రిడ్జిల సందర్శన



పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం విశ్వనాథ్

దొరవారిసత్రం: చెన్నై డివిజన్ పరిధిలోని దొరవారిసత్రం, అక్కరపాక, పోలిరెడ్డిపాళెం, మేలుపాక, మినమనముడి, నేతాజీనగర్, నెలబల్లి సమీపంలో రైలు పట్టాలు దాటే ప్రాంతాల్లో రైలు గేట్లను తొలగించి సబ్‌వే బ్రిడ్జిలను రైల్వే అధికారులు నిర్మించారు. వీటిని చెన్నై డివిజన్ డీఆర్ఎం ఇరియాబుక్యవిశ్వనాథ్, ఏడీఆర్ఎం-1, 2 తేజ్‌ప్రతాప్‌సింగ్, సచిన్‌పునీత్ గురువారం ప్రత్యేక రైలుతో విచ్చేసి, సందర్శించారు. పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 26వ తేదీన ఆన్‌లైన్‌లో చెన్నై డివిజన్‌లోని 17 సబ్‌వే బ్రిడ్జిలను పీఎం నరేంద్రమోదీ ప్రారంభించనున్నారని,ఇందులో భాగంగానే ఈబ్రిడ్జిలను రైల్వే అధికారులు పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. లోపాలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని డీఆర్ఎం స్థానిక రైల్వే అధికారులను ఆదేశించారు. సబ్‌వేలు ప్రారంభ సమయంలో స్టేజీలు ఏర్పాటుతో పాటు కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించేలా ఆయా ప్రాంతాల్లోని బ్రిడ్జిల వద్ద ఎల్‌ఈడీ టీవీలు ఏర్పాటు చేస్తామని రైల్వే అధికారులు తెలిపారు. వీరి వెంట డీఎస్‌టీఈ మురళీకృష్ణ, కమర్షియల్ ఆఫీసర్ శేషయ్య, సిబ్బంది ఉన్నారు.

తెగుళ్లపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఏడీఏ

దక్కిలి: నిమ్మసాగులో తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని తిరుపతి జిల్లా వనరుల కేంద్ర ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. మండలంలోని వడ్లమోపూరులో గురువారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్మతోటల్లో ఎక్కువగా దోమ, నల్లి ఆశించి ఉందని, దీని నివారణకు ఫిప్రోనిల్ అనే మందును లీటర్ నీటికి ఒక ఎంఎల్ మందును ఎకరాకు 200 లీటర్లు చొప్పున పిచికారి చేస్తే తెగుళ్లను నివారించవచ్చన్నారు. వెంకటగిరి వ్యసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ మాట్లాడుతూ వరి పైరు కోసిన తరువాత పొలంలో నువ్వు, పెసర పంట వేసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చని, తద్వారా రైతులకు ఆదాయం కూడా పొందవచ్చనన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న వరి పంటకు మెడ విరుపు ఆశించిందని, దీని నివారణకు ఫ్యూజిన్ అనే మందును ఒక ఎంఎల్ లీటర్ నీటికి కలిపి ఎకరాకు 200 లీటర్లు వంతున పిచికారి చేస్తే నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ విజయభారతి పాల్గొన్నారు.

జోరుగా వరి కోతలు



వరి కోత కోస్తున్న యంత్రాలు

వాకాడు: మండలంలో వారం రోజులుగా వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. దీంతో మండలంలోని అన్నదాతలు బిజీబిజీగా ఉన్నారు. గత ఏడాది వర్షాలు సంవృద్ధిగా కురవడంతో మండలంలో 15 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఈ రబీలో వాకాడు, జంజాలపాడు, కల్లూరు చెరువు, ముట్టెంబాక, బక్కరేగడ, దేవునిమాన్యం, తూపిలి, నెల్లిపూడి, సిద్ధిగుంటపాళెం, మాన్యాలనట్టు, చెరుకుములం, గొల్లపాళెం, కాశీపురం, అడవి, బసమ్మకండ్రిగ తదితర గ్రామాల్లో రైతులు బ్యారేజ్ ఆయకట్టులో అధిక శాతం వరి సాగు చేశారు. ఆ వరి పంటను ప్రస్తుతం కోతలు కోస్తున్నారు. సాధారణంగా ఎకరా వరి 2.5 పుట్ల నుంచి 3 పుట్లు ధాన్యం దిగుబడులు వస్తాయి. అయితే ఈ ఏడాది ఎకరాకు 4 నుంచి 4.5 పుట్ల ధాన్యం దిగుబడి వస్తుంది. దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గిట్టుబాటు ధరలు లభించడంతో మంచి లాభాలు గడిస్తున్నారు. ఎకరాకు పెట్టుబడులు పోను రూ.50 వేలు వరకు ఆదాయం వస్తోందని పుడమిపుత్రులు చెబుతున్నారు.

ఫోర్జరీ డాక్యుమెంట్లతో రుణాలు

దక్కిలి (బాలాయపల్లె): తన భార్య పేరున ఉన్న పొలానికి ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి, దాన్ని తనఖా పెట్టి సొసైటీ ఉద్యోగి రుణాలు పొందారని కయ్యూరు సొసైటీ అధ్యక్షుడు రావిళ్ల వెంకటకృష్ణమనాయుడు పోలీసులు, తహసీల్దార్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు.. బాలాయపల్లె మండలం కయ్యూరు సొసైటీ అధ్యక్షుడు రావిళ్ల వెంకటకృష్ణమనాయుడు భార్య విజయలక్ష్మి పేరున అక్కసముద్రంలో సర్వే నంబర్ 183-2, 183-3, 183-4, 183-5, 183-6లో 5 ఎకరాలు పొలం ఉంది. 183-1లో రోడ్డు, పొలం ఉంది. ఈ పొలానికి యాచవరం సొసైటీలో పని చేస్తున్న సూపర్‌వైజర్ గొట్టి సత్యనారాయణ ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించాడు. ఆ డాక్యుమెంట్లతో తన కుటుంబ సభ్యులు బాలాజీ, సరోజనమ్మ తదితరుల పేర్లతో రుణాలు పొందారు. ఇటీవల పొలం యజమానులు ఈసీ కోసం వెంకటగిరి సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వెళ్లగా పొలం అంతా మరొకరి పేరున ఉన్నట్లు గుర్తించారు.

విజిలెన్స్ పేరుతో వేధింపులు ఆపాలి

గూడూరురూరల్: పంచాయతీ రాజ్ ఇంజినీర్లను విజిలెన్స్ పేరుతో చేస్తున్న వేధింపులు ఆపాలని ఆంధ్రప్రదేశ పంచాయతీ రాజ్ డిప్లొమా ఇంజినీర్ల సంఘం గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ అన్నారు. పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద గురువారం సిబ్బందితో కలసి ఆయన మాట్లాడారు. వీవీ దయాళ్, మునికుమార్, రవీంద్రకుమార్, కృష్ణబాబు, కవిత, వెంకటేశ్వర్లు, ఇలియాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

కండలేరులో 10.591 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 10.591 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 380 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, హైలెవల్ కాలువకు 120, లోలెవల్ కాలువకు 210 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నిమ్మ, చీనీ ఫలసాయం వేలం పాటలు రేపు

వెంకటగిరిరూరల్: కృషి విజ్ఞాన కేంద్రంలో పలు పంట ఉత్పత్తులు పొందే హక్కులకు శనివారం వేలం పాటలు నిర్వహించనున్నట్లు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి గోవిందరాజులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెరియవరం సమీపంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో ఉన్న 230 నిమ్మచెట్లు, 140 చీనీ చెట్లు, 75 సపోటా చెట్ల నుంచి వచ్చే ఫలసాయం పొందే హక్కులకు వేలం పాటలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు పాటలో పాల్గొనాలని సూచించారు.

పెంచలకోనలో పుష్పయాగం రేపు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఉన్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి వారికి శనివారం పుష్పయాగం నిర్వహించనున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. మాఘ పౌర్ణమి సందర్భంగా పుష్పయాగం నిర్వహిస్తామన్నారు. ఉదయం స్వామి అమ్మవార్లకు స్నపన తిరుమంజనం, రాత్రి వివిధ రకాల పుష్పాలతో స్వామి అమ్మవార్లకు పుష్పయాగం, అనంతరం క్షేత్రోత్సవం జరుగుతుందన్నారు.